
బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్
- ఐదు రోజుల పాటు వేడుక
- ఆటపాటలతో ఆడపడుచుల సందడి
- నేటి నుంచి ప్రారంభం

7లో..


హుస్నాబాద్‌లో విక్రయిస్తున్న సీతాఫలాలు



సీతాఫలం.. ధర వింటే భయం!

- గంప కాయలు రూ.500
- హుస్నాబాద్ నుంచి ఇతర పట్టణాలకు ఎగుమతి
- ఈ సారి తక్కువ సైజుల కాత

హుస్నాబాద్, సెప్టెంబరు 26 : పేదోడి ఆపిల్ పండైనా సీతాఫలం మహాప్రియమైంది. ఆపిల్‌లోని విటమిన్ల కంటే అధికంగా ఉండే సీతాఫలాలకు ప్రస్తుతం డిమాండ్ ఏర్పడింది. గుట్టలు, కంచెలు ఎక్కువగా ఉన్న మెట్టప్రాంతమైన హుస్నాబాద్‌లో ఈ ఫలాలు ఎక్కువ కాస్తాయి. వీటితో ఈ రెండు నెలలు ఈ ప్రాంతంలోని ముదిరాజ్‌లు, గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విక్రయించే వారు. ప్రస్తుతం పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. ఫలితంగా వీటి ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. దళారులు రైతుల నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్, కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేటకు ఎగుమతి చేస్తున్నారు. ఈసారి వర్షాలు లేటుగా పడటంతో కాత బానే ఉన్నా పండ్లు చిన్నసైజులో లభిస్తున్నాయి. కోతుల బెడద కూడా అధికంగా ఉందని కాయలను తెంపేస్తున్నాయని, దిగుబడి చాలా వరకు తగ్గిందని రైతులు చెబుతున్నారు



వారం నుంచి సీతాఫలాల విక్రయాలు జోరందుకున్నాయి. తెల్లవారుజామునే సీతాఫలాల గంపలతో హుస్నాబాద్ బస్టాండ్ ప్రాంతం నిండిపోతుంది. ఇక్కడి నుంచి వందలాది ట్రాలీ ఆటోల్లో వివిధ పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. మేము పొద్దంతా కష్టపడి తీసుకొస్తే గిట్టుబాటు కావడం లేదని, దళారులు తమ వద్ద తీసుకుని ఎక్కువ ధరలకు పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు.

వంద కాయలు రూ.800

హుస్నాబాద్‌లో గంప సీతాఫల కాయలను రూ.500 పైగా విక్రయిస్తున్నారు. గంపలో 60నుంచి 70వరకు ఉంటున్నాయి. అదే సైజు పెద్దగా ఉండే వంద కాయల గంపకు రూ.800 వరకు విక్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల తరువాత వీటి ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు..

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు సీతాఫలాలు ఎగుమతి అవుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, కుందనవానిపల్లి, ధర్మారం, నందారం, తెనుగుపల్లి, మల్‌చెర్వు తండా, రేగొండ, గుబ్బడి, కోహెడ మండల బస్వాపూర్, నాగసముద్రాల, తదితర గ్రామాల నుంచి హుస్నాబాద్‌కు తీసుకొచ్చి దళారులకు విక్రయిస్తున్నారు.



చిన్న సైజులో వస్తున్నాయి

- చిట్యాల సమ్మయ్య, గౌరవెల్లి కొత్త కాలనీ

ఈసారి వర్షాలు ఆలస్యంగా రావడంతో చెట్లకు కాయలు కాసినప్పటికీ చిన్నగా ఉంటున్నాయి. కోతులు కాయలను తెంపేస్తున్నాయి. పొద్దంతా గుట్టల్లో తిరిగి కష్టపడి తెంపి తీసుకొస్తే కూలి గిట్టుబాటు అవుతుంది.

నెల రోజులు ఉపాధి దొరుకుతుంది

- గుగులోతు సర్దార్, అక్కన్నపేట



సీతాఫలాలతో ఈ నెల రోజులు ఉపాధి దొరుకుతుంది. రోజు నాలుగైదు గంపలు తీసుకొచ్చి హుస్నాబాద్‌లో దళారులకు విక్రయిస్తాం. మాకు గంపకు రూ.250 నుంచి350 వరకు ఇస్తారు. ఎవరైనా వచ్చి కొనుగోలు చేస్తే మరో రూ.50 ఎక్కువ వస్తాయి.

పేదల సంక్షేమమే ధ్యేయం

- అటవీ, దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- ప్రొటోకాల్ విషయంలో ఇరుపార్టీల మధ్య వాగ్వాదం
- ఎట్టకేలకు దుబ్బాకలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

దుబ్బాక, సెప్టెంబరు 26: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అటవీ, దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. భేషజాలకు వెళ్లకుండా ప్రజాసంక్షేమమే తమకు ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. గురువారం దుబ్బాకలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 519 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావు కూడా హాజరయ్యారు. చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ చోటుచేసుకోవడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పరస్పర నినాదాలు చేశారు. నినాదాల మధ్యలోనే మంత్రి మాట్లాడారు. దుబ్బాకలో పోలీస్ బందోబస్తు మధ్య ప్రభుత్వ కార్యక్రమం జరగడం బాధ కలిగిస్తుందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జులతో అధికారిక కార్యక్రమాలు చేశారని ఆమె గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. గతంలో మాదిరిగా తాము చేయబోమని, కేవలం నియోజకవర్గ ఇన్‌చార్జులు తమ పక్కన నిలబడతారని చెప్పారు. కార్యకర్తల, నాయకుల మనోవేదన పదేళ్లు పడ్డ ఇబ్బందుల మూలంగానే ఈరోజు సంఘటనకు కారణమన్నారు.


దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి కొండాసురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

చెక్కుల పంపిణీకి పట్టుబట్టిన ఎమ్మెల్యే 'కొత్త'

మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ సమక్షంలో జరగాల్సిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ సమన్వయలోపం వల్ల రోజు రోజుకూ ఆలస్యమవుతుంది. అయితే, బుధవారం సిద్దిపేటలో జరగాల్సిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి మంత్రి పొన్నంకు సమాచారం లేకపోవడంతో మళ్లీ వాయిదా పడింది. ఆశగా జిల్లా కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. అందులో దుబ్బాక నియోజకవర్గానికి చెందిన వారు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే చాలా కాలంగా లబ్ధిదారులు చెక్కుల కోసం తిరుగుతున్నారని, ఇంకా ఆలస్యం చేయడం భావ్యం కాదని సూచించారు. ఇద్దరు మంత్రుల్లో ఎవరో ఒకరు దుబ్బాకకు వచ్చి పంపిణీ చేయాలని తాను సభాధ్యక్షుడిగా ఉంటానని చెప్పడంతో అప్పటికప్పుడు కార్యక్రమాన్ని నిర్ణయించారు. గురువారం గందరగోళం నెలకొన్నా లబ్ధిదారులందరికీ చెక్కుల పంపిణీ చేశారు.

డిపాజిట్ రాని వ్యక్తికి ప్రభుత్వ వేదికపై అవకాశమా?

మంత్రి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఏనాడు ప్రొటోకాల్ విస్మరించలేదని గుర్తుచేశారు. దుబ్బాక ఉప ఎన్నికలో ఓడిన సుజాతమ్మను తీసుకొచ్చి కొబ్బరికాయలు కొట్టించలేదన్నారు. డిపాజిట్ రాని వ్యక్తిని ప్రభుత్వ వేదికలపై పిలిచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో అప్పటి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుకే ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రతీదీ రాజకీయం చేయాలని చూస్తుందని చెప్పారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. చెక్కుల పంపిణీకి వచ్చిన మంత్రికి తాము కృతజ్ఞతలు తెలిపి చెప్పి సగౌరవంగా సాగనంపామని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ప్రభుత్వ కార్యక్రమాన్ని దిగజార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



చేనేత బిడ్డవు.. మా కష్టాలు తీర్చమ్మా..

"పద్మశాలి చేనేత బిడ్డవు.. చేనేతల కష్టాలు తెలిసిన వ్యక్తివి.. చేనేత గడ్డ దుబ్బాకకు వచ్చిన మీరు.. నేతన్నల గోసలు తీర్చి వెళ్తారని భావిస్తున్నా అక్కా.." అంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు కోరారు. గురువారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొన్న మంత్రి సురేఖకు ఎంపీ రఘునందన్‌రావు చేనేత పోగులదారం దండను మెడలో వేసి వినతిపత్రం సమర్పించారు. "ఇది పోగులదండ కాదు.. సమస్యల హారం. అందమైన చీరను నేసే పోగుల వెనుక కష్టాలు పోగవుతున్నాయని, కార్మికుల గోసలున్నాయని, దుబ్బాక చేనేత కార్మికులను ఆదుకోవాలని" ఆయన కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సమయం చూసుకుని మరోసారి వస్తానని, దుబ్బాక చేనేతల సమస్యలను తెలుసుకుంటానని, ప్రభుత్వాన్ని కోరి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.


వాగ్వాదానికి దిగిన కార్యకర్తలను తోసేస్తున్న పోలీసులు

చేర్యాలకు నేడు మంత్రి కొండా సురేఖ

- ఇటు సొంత పార్టీలో రగడ.. అటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే
- ప్రొటోకాల్‌పై ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఫైట్

చేర్యాల, సెప్టెంబరు 26 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో భాగంగా అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నేడు చేర్యాలకు రానున్నారు. అధికారులతో పాటు అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమైనప్పటికీ ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉండటంతో కార్యక్రమం అత్యంత రసవత్తరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఇక్కడ కొమ్మూరి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడం, ఎన్నికల సమయం నుంచి ఇరుపార్టీల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొనడం, ప్రొటోకాల్ విషయంలోనూ తగాదాలకు పాల్పడుతున్నారు. అభివృద్ధి పనులు



పూర్తయినప్పటికీ ఇరువురి మధ్య ప్రొటోకాల్ రగడ కొనసాగుతుండటంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరోపక్క కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత రాజకీయ పరిణామాల దృష్ట్యా జనగామ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్లు, అసంతృప్తులు కొమ్మూరిపై వ్యతిరేకంగా అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం, అందుకు ఆయన విరుగుడు చర్యలు తీసుకుని జనగామ బాస్ నువ్వే అంటూ అధిష్ఠానం భరోసా పొందారు. కానీ, ఇటీవల జనగామలో జరిగిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మూరిని వేదికపై నుంచి దిగాలని సొంత పార్టీ నేతలు ఆందోళన చేపట్టారు. దీనికి తోడు జనగామకు చెందిన కంచె రాములు తనను హత్య చేయించడానికి రాగుల శ్రీనివాస్‌రెడ్డికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సుపారీ ఇచ్చారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, జనగామకు చెందిన సీనియర్ నేతలతో రాగుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడిన విషయమై వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ప్రకంపనలు తలెత్తాయి. ఇదే విషయమై రాగుల శ్రీనివాస్‌రెడ్డి తనను చంపుతామని బెదిరింపులకు పాల్పడి వీడియో చిత్రీకరించి తనపై అభాండాలు మోపారని పేర్కొంటూ కంచ రాములుతో పాటు సీనియర్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయంలో రసవత్తర మలుపులు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గంలో ఎక్కడచూసినా ఇదేవిషయం హాట్‌టాపిక్‌గా మారిన నేపథ్యంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లాపై చేసిన ప్రకటనలు దుమారం రేపుతున్నాయి. ఈ తతంగం వెనుక ఎమ్మెల్యే పల్లా హస్తం ఉందని, పార్టీలో కొంతమందిని కోవర్టులుగా మార్చుకుని డబ్బు ఇస్తూ దుష్ప్రచారం చేయిస్తున్నాడని ఆరోపించారు. నేడు చేర్యాలలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుండటంతో స్థానికంగా వాతావరణం నివురుగప్పిన నిప్పులా మారింది. కొన్నినెలలక్రితం కొమురవెల్లి మల్లన్న కల్యాణ బ్రహ్మోత్సవ సమీక్షా సమావేశానికి మంత్రి సురేఖ, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివేదికపై ఆహ్వానించడాన్ని తప్పుబడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహిష్కరించి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఇరువురి మధ్యన వైరం తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో నేడు నిర్వహిస్తున్న కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరవుతుండటంతో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని చర్చించుకుంటున్నారు.

ప్రయోగాత్మక బోధనతో
సృజనాత్మకత

- విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేలా ఉపాధ్యాయులకు శిక్షణ

కొండపాక, సెప్టెంబరు 26: ప్రాథమిక స్థాయిలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండడం, అందుకు తగ్గట్టుగానే ఉపాధ్యాయుల సంఖ్య కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. వారు ప్రధానంగా తెలుగు, గణితం, ఆంగ్లంపైనే శ్రద్ధ వహిస్తుంటారు. విజ్ఞానశాస్త్రం సబ్జెక్టు విద్యార్థులకు అంతంత మాత్రంగానే అందుతుంది. ఫలితంగా విద్యార్థులు పైతరగతులకు వెళ్లినా ఆ సబ్జెక్టుపై పెద్దగా ఆసక్తిచూపడం లేదు. దీంతో విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం కోసం సైన్స్ అకాడమీ వారు సమగ్ర శిక్ష, టెక్ మహీంద్రా సహాయత ట్రస్టు సహకారంతో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ 2017 నుంచి దాదాపు 4వేల మందికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ అందిస్తున్నది. ఈ సంవత్సరం తొమ్మిదో బ్యాచ్‌కు శిక్షణ అందిస్తుంది. అయితే, ఈ శిక్షణా కార్యక్రమాలు హైదరాబాద్‌లో సైన్స్ అకాడమీలో మాత్రమే జరుగుతాయి. కానీ మొదటిసారి సిద్దిపేట జిల్లాలో ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి ప్రారంభమైన శిక్షణా కార్యక్రమం 27తో ముగుస్తుంది. విద్యార్థులకు ప్రత్యక్షంగా అనుభవ పూర్వకంగా అర్థం చేసుకునే విధంగా ప్రయోగాత్మక కార్యక్రమాలు అందివ్వడానికి శిక్షణ అందిస్తున్నారు.


శిక్షణలో ప్రయోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు

అంశాలు

రక్తప్రసరణ వ్యవస్థ పనితీరు, చెట్లు, మొక్కలు రకాలు, మానవ శరీర నిర్మాణ వ్యవస్థ, సమతుల ఆహారం, సౌర వ్యవస్థ, రాత్రి పగలు, ఋతువులు, అమావాస్య పౌర్ణమి, ఊపిరితిత్తుల పనితీరు, ప్యామిలీ ట్రీ, ద్రవ్యరాశి బరువులు కనుగొను పద్ధతి, ట్యాంగ్రామ్ పజిల్స్, తదితర అంశాలను శిక్షణలో భాగం కానున్నాయి.

40 మంది ఉపాధ్యాయులకు

జిల్లాలోని ఎంపిక చేసిన 40 మంది ఉపాధ్యాయులకు శిక్షణను అందిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గా రేవతి, అమీర్ వ్యవహరిస్తున్నారు. శిక్షణ శిబిరాలను రాష్ట్ర బృందం జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు.



ఉపయోగపడే కార్యక్రమం

-సిద్దుల నవీన్, ఉపాధ్యాయుడు ఐనాపూర్

లోకాస్ట్ నో కాస్ట్‌తో పాఠ్యాంశాలకు అనుగుణంగా వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేయడం, తదనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి ఈశిక్షణ ఎంతో ఉపకరిస్తుంది.

సులభ పద్ధతుల్లో అవగాహన

- శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, కుకునూరుపల్లి

సులభ పద్ధతుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ప్రయోగాలను శిక్షణలో నేర్చుకున్నాం. వాటి ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తాం. కొత్త విషయాలను తెలుసుకుని వాటిని విద్యార్థులకు అందిస్తాం.

జిల్లాకు ప్రాధాన్యమివ్వడం సంతోషకరం

- సత్య కుమార్, తొగుట మండల ఉపాధ్యాయుడు

హైదరాబాద్ కేంద్రంగా మాత్రమే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. కానీ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో శిక్షణ అందించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా కృషి చేయడం అభినందనీయం. సైన్స్ అకాడమీ సహాయత ట్రస్ట్, టెక్ మహేంద్ర వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.


శిక్షణలో ఉపాధ్యాయులు తయారుచేసిన న్యూట్రిషన్ చార్ట్

ప్లాస్టిక్ భూతాన్ని
తరిమేయాలి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని, క్లాత్ సంచులను ఉపయోగించాలని సిద్దిపేట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత సూచించారు. వేడివేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసినట్లయితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై గురువారం సిద్దిపేటలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలను డ్రామా, డ్యాన్స్‌ల ద్వారా ప్రదర్శించారు. అనంతరం అంబిటాస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎడ్ల జ్యోతి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ఐటీఐ వావ్ ఫౌండేషన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







బ్లాస్టింగ్ దడ

స్టోన్ క్రషర్ల పేలుళ్లతో బెంబేలు

- బాంబుల మోతకు ఊడిపడుతున్న స్లాబు పెచ్చులు
- దెబ్బతిన్న అమరవీరుల స్తూపం
- మాధారం, రాళ్లకత్వ, కాజీపల్లి స్థానికుల్లో భయం

జిన్నారం, సెప్టెంబరు 26: మండలంలో స్టోన్ క్రషర్ల బ్లాస్టింగ్‌లు దడ పుట్టిస్తున్నాయి. పేలుళ్లతో స్థానిక గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎక్కడ క్రషర్ల వద్ద అమర్చిన పేలుడు పదార్థాలు పేలుతాయో అనే భయాందోనలతో క్రషర్ల సమీపంలో వ్యవసాయ పనులు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇష్టారాజ్యంగా జరుపుతున్న పేలుళ్లతో సమీప గ్రామాల నివాసాలు దెబ్బతింటున్నాయి. స్లాబుల పెచ్చులూడటం, గోడలకు పగుళ్లు రావడం సహా అద్దాలు పగలటం తరుచూ జరుగుతున్నాయి. ఇటీవల మాధారం శివారులోని క్రషర్ క్వారీల వద్ద జరిపిన పేలుళ్ల ధాటికి ఓ వ్యక్తి నివాసం స్లాబు పెచ్చులూడి ప్రమాదం తప్పగా.. స్థానికంగా ఉన్న అమరవీరుల స్థూపం గ్రానైట్ ఫలకలు ఊడిపడ్డాయి. దీనికి తోడు క్రషర్‌ల నుంచి తెల్లటి పౌడర్ సమీపంలోని పంట పొలాలు, నివాసాలను కమ్మేస్తున్నాయి.

భయాందోళనలో గ్రామాలు

మాధారం, కాజీపల్లి గ్రామాల పరిధిలో 15 వరకు కంకర క్వారీలు ఉన్నాయి. ఇక్కడ కొన్ని క్రషర్‌లు నిత్యం భారీ స్థాయిలో పేలుళ్లు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు తక్కువ స్థాయిలో 10 అడుగుల వరకు మందుగుండును నింపి పేలుళ్లు చేయాల్సి ఉండగా..



పేలుడు దాటికి ఊడిన స్లాబు పెచ్చులు



పేలుళ్ల ధాటికి గ్రానైట్ ఫలకలు ఊడిన అమరవీరుల స్తూపాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

అందుకు ఐదు రెట్లు బ్లాస్టింగ్స్ జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా జరుపుతున్న పేలుళ్ల ధాటికి మాధారం గ్రామానికి చెందిన కురుమ దుర్గయ్య నివాసం స్లాబు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవంతో పెను ప్రమాదం తప్పింది. ఇక ఇక్కడే ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం క్రషర్‌ల పేలుళ్ల ధాటికి దెబ్బతిన్నది. స్థూపానికి అమర్చిన గ్రానైట్ ఫలకలు ఊడిపడ్డాయి. స్థూపాన్ని పరిశీలించిన మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ క్రషర్ల తీరుపై మండి పడ్డారు. కాగా పేలుళ్ల నియంత్రణ అధికారం తమకు లేదని వివిధ శాఖలు నెపాన్ని ఇతరులపై నెట్టేస్తున్నాయి. క్రషర్‌ల పేలుళ్ల సమస్యలపై ఏర్పాటు చేసిన జేఏసీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు గణేష్ తదితరులు క్వారీల తీరుపై ఇటీవల ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక ఇదే సమస్య రాళ్లకత్వ గ్రామ శివారులోని క్రషర్లతో ఉండగా.. కొత్తగా మరికొన్ని క్రషర్ల ఏర్పాటు వద్దని స్థానికులు ఈ నెల 21 సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

పేలుళ్లను నియంత్రించాలి

మాధారం, కాజీపల్లి పరిధిలో ఉన్న పలు స్టోన్ క్రషర్‌ల పేలుళ్లను వెంటనే నియంత్రించాలి. క్రషర్, క్వారీల పేలుళ్ల, ఇతర సమస్యలపై వివిధ శాఖలకు ఇది వరకే ఫిర్యాదు చేశాం. ఉన్న వాటితోనే తీవ్ర సమస్యలు ఉండగా.. కొత్తగా మరికొన్ని క్రషర్, క్వారీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం సరికాదు.

\- సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్



దిగువకు విడుదలవుతున్న వరద జలాలు

సింగూరుకు కొనసాగుతున్న వరద

ఇన్‌ఫ్లో 14,563 క్యూసెక్కులు..అవుట్ ఫ్లో 19,107 క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 26 : సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. నాలుగైదు రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండగా గురువారం 14,563 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈనెల 22వ తేదీన అర్ధరాత్రి నుంచి వరద నీటి ప్రవాహం పెరుగడంతో 11వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. తాజాగా బుధవారం రాత్రి వరద ఉధృతి మరింత పెరగడంతో గురువారం మధ్యాహ్నం 6వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తారు. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,284 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల గుండా 2,823 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు వదులుతున్నారు. దీంతో 9,107 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. ప్రాజెక్టులో 29.917 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి 29.827 టీఎంసీలు నిల్వలున్నాయి. 7.5 జల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బైన్లు పనిచేస్తుండగా 0.36 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఇదిలావుండగా, మంజీర రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 8వ నంబరు క్రస్ట్ గేట్‌ను మూడున్నర మీటర్లు, 7వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరు ఎత్తు, ఒక స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తి నీటిని దిగవన ఘనపురం కట్టకు వదులుతున్నారు.

గీతంలో పైలట్ శిక్షణపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఫ్లైట్ సిమ్యులేటర్‌పై ఒకరోజు పైలెట్ శిక్షణ వర్క్‌షాప్ గురువారం జరిగింది. స్పేస్‌జెన్ సీఈవో కెప్టెన్ విగో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విమానం నిలిపిన ప్రదేశం నుంచి పైకి ఎగిరే వరకు మొత్తం ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విమానాన్ని నియంత్రించడం, గాలిలో ప్రయాణిస్తూ చేసే విన్యాసాలు, గాలిలో ఉండగానే ఇంజన్ ఆపి డిప్ స్టిక్ ల్యాండింగ్ చేయడం వంటివి చేసి చూపి, ఫ్లైట్ సిమ్యులేటర్ అనుభవాన్ని విద్యార్థులకు కల్పించారు. తమ ఏరోనాటికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, భారత వైమానిక దళం స్టేషన్ల సందర్శన ఏర్పాటు చేస్తానని చెప్పారు. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ సందర్శనతోపాటు అక్కడి పైలట్లతో ముఖాముఖి సంభాషణను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల మాట్లాడారు. కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ.అక్తర్ ఖాన్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 26 : 2008లో డీఎస్సీ పరీక్ష రాసి 70 : 30 రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయటం కోసం ధ్రువపత్రాల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ నెల 27, 28 తేదీల్లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉంటుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వెరిఫికేషన్‌కు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణతో పాటుగా 2008లో డీఎస్సీ పరీక్ష రాసిన హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన 292 మంది అభ్యర్థుల జాబితా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, డేటా వెరిఫికేషన్ ఫామ్ కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. డెటా వెరిఫికేషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని అభ్యర్థుల వివరాలతో పాటుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి సమ్మతి తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ ఫామ్ గెజిట్ అటెస్టేషన్ చేయించి ధ్రువపత్రాలతో హాజరుకావలని సూచించారు. 28వ తేదీ తర్వాత ఎలాంటి వెరిఫికేషన్ ఉండదని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

- గిర్మాపూర్ రెసిడెన్షియల్ కాలేజీలో పోటీలు
- హాజరైన రెండు జిల్లాల విద్యార్థులు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

కొండాపూర్, సెప్టెంబరు 26 : కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రీడా ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి వివిధ కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. అండర్-19 బాలబాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల ఎంపికలను నిర్వహించారు. ఎస్జీఎఫ్ ఇంటర్మీడియట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.గణపతి పర్యవేక్షణలో కొనసాగిన ఎంపిక పోటీల్లో కోచ్ ధన్‌రాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

- జయంతి వేడుకలలో కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



పూలమాల వేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26 : వెట్టిచాకిరి చేతులతో బంధుకలు పట్టించి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం చిట్కుల్‌లో ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజకులతో కలిసి కేక్‌ను కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనుల అమరత్వమేనని, ఆ మహనీయుల ఉద్యమస్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించే తత్వం అలవడిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో శిథిలమైపోయిన బతుకులను బాగు చేయడానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొరలు, జమీందారుల చేతుల్లో బానిసలుగా మగ్గుతున్న బహుజనులకు స్ఫూర్తినిస్తూ నిజాంకు ఎదురునిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పంతో హైదరాబాద్ కోటిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరుని పెట్టి, ఆ వీరనారికి గుర్తింపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో సబ్బండ వర్గాల హక్కుల కోసం పోరాడుతూ, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నీలం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చాకలి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్, మురళీ, రాజ్ కుమార్, ఆంజనేయులు, నారాయణరెడ్డి, చాకలి సత్తయ్య, చాకలి కృష్ణ, చాకలి బాబు, నర్సింలు, యాదయ్య, కిషోర్ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రావి ఆకుపై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రం



రావి ఆకుపై బాపూజీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 : ఈ నెల 27న స్వాతంత్ర్య సమర యోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ ఆయన చిత్రాన్ని గురువారం రావి ఆకుపై వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. స్వాతంత్రోద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ వరకు ఆయన చూపిన పోరాట పటిమ మరువలేనిదన్నారు. తెలంగాణ సమాజానికి బాపూజీ ఎప్పటికి నిలుస్తారన్నారు. ఆయన జయంతి సందర్భంగా రాగి ఆకుపై చిత్రం వేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిహారం ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తాం

- వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద నాల్గో రోజుకు చేరిన భూనిర్వాసితుల ఆందోళన



వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

వర్గల్, సెప్టెంబరు 26 : వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళన బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నది. టీజీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో దక్కాల్సిన పరిహారాన్ని అందించాలని, కోట్లాది రూపాయల విలువ చేసే సాగు భూములకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.10 లక్షలు ఇచ్చి భూములను రైతుల వద్ద నుంచి బలవంతంగా లాక్కున్నారని వాపోయారు. ప్రతీ రైతుకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని ఇంటి నంబర్ టోకెన్ మాత్రమే ఇచ్చారని, ఇప్పటి వరకు ఇంటి స్థలం చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద తక్కువ ధరకు భూములు తీసుకున్న అప్పటి ప్రభుత్వం పరిశ్రమలకు కోట్లాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంత వరకు టీజీఐఐసీ భూముల్లో నిర్మాణమవుతున్న పరిశ్రమల నిర్మాణాలను అడ్డుకుంటామన్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్

- ఐదు రోజుల పాటు వేడుక
- ఆటపాటలతో ఆడపడుచుల సందడి
- నేటి నుంచి ప్రారంభం



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 26 : చాలా పండుగల నేపథ్యం, సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయి. అలాంటివే తెలంగాణ వ్యాప్తంగా ఆడపడుచులు సంబురంగా జరుపుకొనే బొడ్డెమ్మ, బతుకమ్మ. బతుకమ్మ పండుగకు ముందుగా బొడ్డెమ్మ పండుగ చేసుకుంటారు. బతుకమ్మను భాద్రపద మాసంలో వచ్చే మహాలయ అమావాస్య (పెద్దల అమావాస్య) నుంచి 9 రోజుల పాటు నిర్వహిస్తారు. బతుకమ్మకు ముందు 5 రోజులు దశమి, 3 రోజులు ద్వాదశి నుంచి బొడ్డెమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. మరికొన్ని చోట్ల 9 రోజులు పాటు బొడ్డెమ్మలు ఆడుతారు. ఐదు రోజులు బొడ్డెమ్మల పండుగ సందడి శుక్రవారం నుంచి మొదలవుతుంది. బతుకమ్మను ఆడపడుచులందరు ఆటపాటలతో పూజిస్తారు. బొడ్డెమ్మను పెళ్లికానీ యువతులు, బాలికలు ఎక్కువగా చేసుకుంటారు.

పుట్టమన్ను తెచ్చి.. పూలతో అలంకరించి

ప్రకృతిలో దొరికే మట్టితో పూలతో అనుబంధమున్న పండుగ ఈ బొడ్డెమ్మ. దీనికి బొట్టె, బొడిప, పొట్టి అనే పర్యాయపదాలున్నాయి. బొడ్డ అనే పదానికి అత్తిచెట్టు అనే మరో అర్థం ఉంది. దీన్నే మేడిచెట్టు, ఔదంబర చెట్టుగా పిలుస్తారు. పిల్లలు లేనివారు సంతానం కలగాలని, పెళ్లి కానీ వారు వివాహం కుదరాలని మేడిపూజ చేసేవారు. ఈ చెట్టులో ఉన్న ఔషధీయ గుణాలు అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. ముఖ్యంగా స్త్రీలలో వచ్చే సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందటారు. ప్రాచీన కాలం నుంచి మేడిపూజ చేస్తూ కాలక్రమేణా బొడ్డెమ్మ పూజగా మారిందని తెలుస్తోంది. బొడ్డెమ్మను చేయడానికి పుట్ట దగ్గరకు వెళ్లి పాలు, పసుపు, కుంకుమ సమర్పించి, పూజలు చేసి పుట్ట మన్నును తీసుకొస్తారు. చెక్కపీటపై మట్టితో మూడు లేదా ఐదు గడులతో గోపురం ఆకారం వచ్చేలా తయారుచేస్తారు. ఆ తర్వాత ఎర్రమట్టితో అలికి, ముగ్గ వేసి, పసుపు, కుంకుమతో బొట్టు పెడతారు. పూలతో అలంకరించి, గుమ్మడి పువ్వు కానీ, పసుపుతో గౌరమ్మను చేసి పూజిస్తారు. బొడ్డెమ్మలను ఒకచోట చేర్చి 'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్, బిడ్డా లేందారు కోల్, నీ బిడ్డ నీలగౌరు కోల్' అంటూ బొడ్డెమ్మగా ఉన్న గౌరమ్మను మహిళలు, యువతులు బొడ్డెమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో వేడుకుంటారు. తర్వాత 'నిద్రపో బొడ్డెమ్మ, నిద్రపోవమ్మా, నిద్రాకు నూరేండ్లు, నీకు వెయ్యేండ్లు నిన్నుగన్న తల్లికి నిండా నూరేళ్లు అని పాడి' బొడ్డెమ్మను తీసి దేవుడి ముందు పెడతారు. ఇలా ఐదు రోజులు ఆడి చివరి రోజున చెరువు దగ్గరకు తీసుకెళ్లి చెక్కపీటమీద ఉన్న బొడ్డెమ్మను 'పోయి రా బొడ్డెమ్మ పోయిరావమ్మా' అంటూ నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ తర్వాత బతుకమ్మ సంబరాలు మొదలవుతాయి.



బొడ్డెమ్మతో చిన్నారి

పండుగ వస్తుందంటే సంతోషం



బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగ వస్తుందంటే సంతోషంగా ఉంటుంది. పొద్దునే పుట్ట మన్ను తెచ్చి, పూలతో అలంకరిస్తాం. రోజు సాయంత్రం ఒక చోట బొడ్డెమ్మలను పెట్టి కోలాటమాడతాం. ప్రసాదాలు పంచుకుని గౌరమ్మను మొక్కుతాం. ప్రకృతిని ఆరాధించటం మన సంప్రదాయంలో ఒక భాగంగా ఉంటుంది.

\- అనిత, సిద్దిపేట

అందరం కలిసి ఆడుకుంటాం



నేను ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తాను. బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగ అంటే చాలా ఇష్టం. చుట్టుపక్కల వాళ్లు, గల్లీలో ఒకచోట చేర్చి బొడ్డెమ్మ ఆడుకుంటాం. పాటలు పాడుతూ కోలాటం ఆడుకుంటాం. ప్రకృతిని పూజించటమనే సంస్కృతీ చాలా గొప్పగా అనిపిస్తుంది.

\- స్నేహ, సిద్దిపేట

పండుగల వెనుక శాస్త్రీయత



నేను సైన్స్ స్టూడెంట్‌ను. నాకు పండుగ వాతావరణం అంటే ఇష్టం. బొడ్డెమ్మలు అందరు ఒకచోట చేరి పాటలు పాడుతూ ఆడటం అంటే ఆనందంగా ఉంటుంది. పండుగల్లోనూ శాస్త్రీయత దాగుంది. పండుగల వల్ల మానావాళికి ఎంతో మేలు జరుగుతుంది.

\- శిరిష, స్టూడెంట్

నీటిపారుదల శాఖ ఏఈఈగా మగ్దుంపూర్ యువతి



బట్ట రేణుక

నంగునూరు, సెప్టెంబరు 26 : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బట్ట రేణుక నీటిపారుదల ఏఈఈగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీటిపారుదల ఉన్నతాధికారుల చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నంగునూరు మండలం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ పొందారు. టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో బట్ట రేణుక రాష్ట్రంలో మహిళ కేటగిరీలో 4వ ర్యాంక్ సాధించి సత్తాచాటారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రేణుక మూడేళ్ల వయసులోనే తండ్రి అయిలయ్య చనిపోయారు. తల్లి రాజవ్వ వ్యవసాయ కూలీగా, బీడీలు చుడుతూ కూతురును పోషించింది. మగ్దుంపూర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. టెన్త్‌లో 555 మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలిచింది. బాసరలోని ఐఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఎంఈ చేశారు. ఐఐటీ(హైదరాబాద్)లో పీహెచ్‌డి చేస్తున్నారు. రేణుకను గ్రామస్థులు, బంధువులు అభినందించారు.

మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా?

- జేఎన్టీయూ వంట గదిలో అపరిశుభ్రంపై ఆర్డీవో ఆగ్రహం
- బాలిక వసతి గృహం వంట శాలలో ఆకస్మిక తనిఖీలు
- సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఎమ్మార్వోకు ఆదేశం
- అందుబాటులో లేని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

పుల్‌కల్, సెప్టెంబరు 26 : చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వసతి గృహాల్లో మెస్ నిర్వహణ తీరుపై ఆర్డీవో పాండు మండిపడ్డారు. 'మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా' అంటూ అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం చట్నీలో ఎలుక పడి వివాదాస్పదమైనా మార్పు రాలేదు. అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఆర్‌ఐ నాగరాజు గురువారం మధ్యాహ్నం భోజన తయారు చేసే సమయంలో జేఎన్టీయూ కళాశాలలోని బాలికల వసతి గృహన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పటిలాగే వంట గది ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, వంట గదిలో నుంచి మురుగు నీరు పారుదల సక్రమంగా బయటకు వెళ్లకపోవడం వంటి వాటిని వారు గమనించారు. వంటలకు వినియోగించే నూనే, కారం, వెల్లుల్లి, పసుపు ఇతర మసాలలు నాణ్యత లేకపోవడాన్ని గుర్తించారు. పెరుగు ప్యాకెట్లను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడంతో అవి గడ్డకట్టి మంచుగడ్డను తలపించాయి. వంటపాత్రలు శుభ్రం చేసే గది నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్ సక్రమంగా లేకపోవడంతో పాటుగా ఉన్న మ్యాన్‌హోల్ సైతం చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నది. మ్యాన్‌హోల్‌లో నిండిపోయిన వ్యర్థ జలాలు పొంగిపొర్లుతుండటంతో వంట గది, వసతిగృహం ఆవరణ అంతా ముక్కుపుటలదిరేలా వాసన వ్యాపిస్తుంది. ఇలాగైతే విద్యార్థులు భోజనం ఎలా చేస్తారని ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి రెండు పర్యాయాలు వసతి గృహాలను తనిఖీ చేసి భోజనం చేయాలని తహసీల్దార్ ఈశ్వరీరాణిని ఆర్డీవో పాండు ఆదేశించారు. అధికారుల తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావులు అందుబాటులో లేరు. ఆర్డీవో పాండు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి వారం రోజుల్లోగా వసతి గృహాలను శుభ్రం చేయాలని, అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తే విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. వసతి గృహలను పరిశుభ్రంగా ఉంచని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని, వినకపోతే విధుల నుంచి తొలగించాలని ఆర్డీవో ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.



బాలికల వసతి గృహంలోని వంట గదిని పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి

అటవీ ఆహ్లాదంతో ఇంపు.. మహానగర చెత్త వేస్తే కంపు

- అటవీ ప్రాంతం సమీపంలో ప్యారానగర్ వద్ద డంపుయార్డు
- ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటుకు ప్రయత్నం
- అప్పటి నుంచి అడ్డుకుంటున్న స్థానికులు
- మళ్లీ అధికారుల కసరత్తుతో చుట్టుపక్కల గ్రామాల్లో అలజడి

నర్సాపూర్/గుమ్మడిదల, సెప్టెంబరు 26 : హైదరాబాద్‌లో సేకరించే చెత్త కోసం అటవీ ప్రాంతం సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు స్థానికులను తీవ్రంగా కలచివేస్తుంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతంలోకి మహానగర చెత్తను తీసుకొస్తే నాశనమవుతుందని, ఈ కంపు తమకెందుకు అంటూ ఇక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

150 ఎకరాలు కేటాయింపు

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో హైదరాబాద్ నగరానికి నాలుగు వైపులా నగరానికి దూరంగా డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ వద్ద డంపుయార్డు కోసం 150 ఎకరాలను నాడు కేటాయించారు. ఇక్కడికి వెళ్లేందుకు అటవీ ప్రాంతం నుంచి రోడ్డు కోసం ఆ శాఖ కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం. అటవీశాఖ కేటాయించే స్థలానికి గాను జీహెచ్‌ఎంసీ అప్పట్లో డబ్బు కూడా చెల్లించినట్లు తెలిసింది. అయితే, అధికారుల ప్రయత్నాలను ఎప్పటికప్పుడు స్థానికులు అడ్డుకుంటూ వస్తూనే ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగగా, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనక్కు తగ్గారు. ఇన్నాళ్లకు మళ్లీ డంపుయార్డు ఏర్పాటును అధికారులు ముందుకు తీసుకొచ్చారు.



ప్యారానగర్ సమీపంలో డంపుయార్డుకు కేటాయించిన స్థలం

విద్యుత్ ఉత్పత్తి కోసం.. వద్దే వద్దు

ప్యారానగర్ డంపింగ్‌యార్డులో చెత్త నిల్వ లేకుండా శాస్త్రీయ విధానాలు అవలంబిస్తామని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని జవహర్‌నగర్ డంపుయార్డులో వేసిన చెత్తను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే వ్యర్థాలను మాత్రమే ప్యారానగర్‌కు తీసుకెళ్లాలనే ఆలోచన తప్ప, పూర్తిగా చెత్తను అక్కడ వేయడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోని పది గ్రామాలకు చెందిన వారు ఎట్టిపరిస్థితుల్లో వద్దంటూ అడ్డుకుంటూ వస్తున్నారు. తెలంగాణ వచ్చాక ఈ మేరకు ఆయా పంచాయతీలు తీర్మానాలు చేసి అధికారులకు అందజేశారు. దీంతో కాస్త వెనక్కు తగ్గినట్టు అనిపించినా తిరిగి ఇప్పుడు డంపింగ్‌యార్డు కోసం పావులు కదుపుతుండడంతో మళ్లీ అలజడి మొదలైంది. అటవీప్రాంతం సమీపంలో చెత్తను వేయడం వల్ల అటవీప్రాంతం దెబ్బతినడమే కాకుండా గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారానగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల వాతావరణం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అటవీప్రాంతం గుండా వర్షపు నీరు నర్సాపూర్ చెరువులోకి వస్తుందని, డంప్‌యార్డు ఏర్పడితే అడవిలోని చెక్‌డ్యాంలు, కుంటలు కలుషితమై చెరువు కూడా దెబ్బతినే అవకాశముందని పట్టణంలో నివసించే వారు వాపోతున్నారు.



డంపుయార్డు ఏర్పాటుపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

రాజకీయాలు పక్కన పెట్టి ఉద్యమించాలి



2015లో ప్యారానగర్ శివారులో డంపుయార్డు ఏర్పాటు కాబోతుందని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ప్రజలలో చైతన్యం వచ్చింది. ప్రజల వ్యతిరేకతను వివరిస్తూ ముందుగా 'ఆంధ్రజ్యోతి'లో ఇచ్చిన కథనాలతో ప్రభుత్వంలో మార్పు వచ్చింది. జిల్లా పరిషత్ సమావేశంలో అప్పటి మంత్రి హరీశ్‌రావుకు వివరించి నాడు డంపుయార్డు ఏర్పాటును అడ్డుకున్నాం. మరోమారు డంపుయార్డు ఏర్పాటును తెరమీదకు తీసుకొచ్చారు. రాజకీయాలు పక్కన పెట్టి అన్ని పార్టీల నాయకులు డంపుయార్డుపై ఉద్యమించాలి. ఈ విషయమై మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వివరించగా సానుకూలంగా వారు స్పందించారు. ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి వివరిస్తానని హామీ ఇచ్చారు.

\- కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ, గుమ్మడిదల

విరమించుకోవాలి



నర్సాపూర్, గుమ్మడిదల అటవీ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. నర్సాపూర్ అటవీప్రాంతానికి అనుకుని ఉన్న రాయరావు చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ప్యారానగర్‌లో డంపుయార్డు వల్ల చెరువు పూర్తిగా కలుషితమవుతుంది. దీనిని ఎట్టి పరిస్థితులో సహించేది లేదు. డంపుయార్డు ఏర్పాటు యత్నాలను విరమించుకోవాలి. లేదంటే గుమ్మడిదల సమీపంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు నర్సాపూర్ పట్టణ ప్రజలతో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.

\- అశోక్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్

డంపుయార్డు వద్దంటూ నర్సాపూర్ మున్సిపాలిటీ తీర్మానం

నర్సాపూర్, సెప్టెంబరు 26 : ప్యారానగర్ అటవీ ప్రాంతం సమీపంలో డంపుయార్డు ఏర్పాటుతో అటవీ పరిసరాలతో పాటు నర్సాపూర్ రాయరావు చెరువు కలుషితమయ్యే ప్రమాదమున్నందున విరమించుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడ డంపుయార్డు ఏర్పాటైతే వ్యర్థాలు వర్షాలు పడే సమయంలో ఆయా గ్రామాల చెరువులతో పాటు నర్సాపూర్ రాయరావు చెరువులోకి వచ్చే అవకాశముందని దీంతో సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతుందన్నారు. అందువల్ల డంపుయార్డు ఏర్పాటును మానుకోవాలని తెలిపారు. సమావేశంలో పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులు, పారిశుధ్య, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వాహణ తదితర అంశాలపై చర్చించారు. దాదాపు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మున్సిపల్ భవనంను కూడా మిగిలిపోయిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని సమావేశంలో పీఆర్ డీఈఈ రాధికకు సూచించారు. త్వరలో నర్సాపూర్‌లో గొర్రెలు, మేకల సంతను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ రామకృష్ణరావు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో చూసినా.. ఈతగాళ్లు వెతికినా దొరకని ఆచూకీ

- నారింజ వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు
- వాగులో జల్లెడపట్టించిన అధికారులు
- ఎన్డీఆర్ఎఫ్ బృందాల కోసం సిఫారస్

జహీరాబాద్, సెప్టెంబరు 26 : ఈతగాళ్లు రంగంలోకి దిగినా.. డ్రోన్ కెమెరా సహాయంతో వెతికినా వాగులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియలేదు. మండల పరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్యలో గల నారింజ వాగు లోలెవెల్ బ్రిడ్జి వద్ద బుధవారం గల్లంతైన షాకీర్ ఆచూకీ కోసం ఎంత వెతికినా జాడ తెలియలేదు. గురువారం తసీల్దార్ రవీందర్, సిబ్బందితో కలిసి వాగు వద్దకు చేరుకుని ఆనవాళ్ల కోసం పర్యవేక్షణ చేపట్టారు. చేపలను పట్టే ఈతగాళ్లను రప్పించి వెతికేందుకు ప్రయత్నించినప్పటికి వాగులో నీటిప్రవాహ ఉధృతి ఎక్కువ ఉండడంతో వాళ్లు కొద్ది దూరం వెతికి వెనక్కి వచ్చారు. వాగు ప్రాంతంలో డ్రోన్ కెమెరా సహాయంతో ఏమైనా ఆనవాళ్లు దొరుకుతాయేమోనని అధికారులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడమైందని ఎన్డీఆర్ఎఫ్ బృందాల కోసం సిఫారస్ చేశామని తహసీల్దార్ రవీందర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చాక షాకీర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతామన్నారు. వాగులో గల్లంతైన షాకీర్ ఇప్పటికే మృతిచెంది ఉంటాడని అధికారులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వాగులో నుంచి తీసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నారింజ వాగు వరద ఉధృతి ఎక్కువ ఉన్నందున వాగులో నుంచి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు గాను రోడ్డుకు అడ్డంగా కంచెను వేసి రాకపోకలు సాగించొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, ఆర్ఐలు రుక్మొద్దీన్, యాదిలాల్, గ్రామస్థులు ఉన్నారు.



ఆచూకీ కోసం డ్రోన్ ఆపరేటర్ సహాయంతో వెతుకుతున్న సిబ్బంది

లోపాలు పునరావృత్తం కావొద్దు

● అదనపు డీఆర్డీవో బాలకృష్ణ


సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న బాలకృష్ణ

దౌల్తాబాద్, సెప్టెంబరు 26: ఉపాధిహామీ పనుల తనిఖీల్లో బయటపడిన లోపాలు పునరావృత్తం కావొద్దని అదనపు డీఆర్డీవో బాలకృష్ణ ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ ఆవరణంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై గురువారం 14 విడత సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14వ విడత సామాజిక తనిఖీలో రూ.75 వేల రూ.300 దుర్వినియోగం జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, క్వాలిటీ కంట్రోలర్ సంతోష్, అంబుడ్స్‌మెన్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఘఫూర్, సూపరింటెండెంట్ జైపాల్‌రెడ్డి, ఏపీవో రాజు, ఎస్పీ రవి, డీఆర్పీలు, వీఎస్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యమేల!?

● నాలుగేళ్లుగా మగ్గిపోతున్న రూ.54.37 లక్షల నిధులు

● 56 పనులకు గానూ 24 మాత్రమే పూర్తి

మద్దూరు, సెప్టెంబరు 26: ప్రభుత్వాలు ఏటా 2011 జనాభా ప్రాతిపదికన గ్రామాలాభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం ద్వారా ఎంపీటీసీ సభ్యులకు ఏటా మౌలిక వసతులు కల్పించేందుకు లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం 2020-24 వరకు 56 పనులకు గానూ రూ.83.07 లక్షలు మంజూరు చేసింది. ప్రజా ప్రతినిధులు పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో నిధులు వెనెక్కి వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నా ఎంపీటీసీలు నిర్లక్ష్యం వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు ప్రాధాన్య క్రమంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, నీటి సరఫరా, పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులు, ల్యాబ్ సౌకర్యాలు, మురుగు కాల్వలు, సామూహిక మరుగుదొడ్లు, పారిశుధ్యం లాంటి పనుల నిర్వాహణను తీర్చేందుకు నిధులు మంజూరవుతున్నా ఎంపీటీసీ సభ్యులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే 2020-21లో 11 పనులకు గానూ రూ.14.90 లక్షలు మంజూరయ్యాయి. 6 పనులను పూర్తి చేయగా పెండింగ్‌లో ఉన్న 5 పనులకు గానూ రూ.6.50 లక్షల నిధులు ఉన్నాయి. 2021-22లో 20 పనులకు గానూ రూ.26.84 లక్షలు మంజూరయ్యాయి. 12 పనులు పూర్తి చేయగా పెండింగ్‌లో 8 పనులకు గానూ రూ.9.50 లక్షలు ఉన్నాయి. 2022-23లో పనులకు గానూ రూ.25.83 లక్షలు మంజూరయ్యాయి. 4 పనులు పూర్తి చేయగా పెండింగ్‌లో ఉన్న 8 పనులకు గానూ. రూ.17.37 లక్షలు నిధులు మూలుగుతున్నాయి. 2023-24లో 13 పనులకు గానూ రూ. 25.50 లక్షలు మంజూరయ్యాయి. 2 పనులు పూర్తి చేయగా పెండింగ్‌లో ఉన్న 11 పనులకు గానూ రూ.21 లక్షలు ఉన్నాయి. సలాఖ్‌పూర్, బైరాన్‌పల్లి, లింగాపూర్, దూళిమిట్ట, నర్సాయపల్లి, జాలపల్లి, వంగపల్లి, తోర్నాల, మద్దూరు, మర్మాముల, హన్మతండా, శిబ్బితండా, లద్నూరు, వల్లంపట్ల, దుబ్బతండాలో పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.26 లక్షలకు పనుల కేటాయింపు చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రొసీడింగ్ కాపీలను అందించలేదని తెలిసింది. అరకొర నిధులతో పనులు చేపట్టలేని పరిస్థితితో పాటు బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు.


మద్దూరులో కొనసాగుతున్న కమ్యూనిటీ మరుగుదొడ్ల పనులు

రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం


ప్రమాదంలో బోల్తాపడి కారు

చేర్యాల, సెప్టెంబరు 26: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన కారును మరో కారు ఢీ కొన్న సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. కొంతమంది మిత్రులు కలిసి ఓ కారును కొనుగోలు చేసి చేర్యాలకు తీసుకువచ్చారు. కొమురవెల్లికి చెందిన శ్రీకాంత్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి మరోకారును ఢీకొటింది. దీంతో వారు ప్రయాణిస్తున్న కారు పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఏయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఆలయాల్లో దొంగతనాలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

కుకునూరుపల్లి, సెప్టెంబరు 26: జల్సాలకు అలవాటు పడి ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసుఉలు అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లికి చెందిన మహ్మద్ రియాజ్, చిన్నకిష్టాపూర్‌కు చెందిన సోమి హరీష్ ఇద్దరూ కలిసి వరుసగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలించిన బంగారం, నగదుతో మద్యం తాగుతూ జల్సాలకు అలవాటు పడ్డారు. గురువారం ఇద్దరు నిందితులు బైక్‌పై వెళ్తుండగా పెట్రోలింగ్ పోలీసులు నిందితులను పట్టుకుని వారి నుంచి తులం బంగారం రూ. 3వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

కొండపాక, సెప్టెంబరు 26: మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని తహసీల్దార్ దిలీప్‌నాయక్ గురువారం పట్టుకున్నారు. కొండపాక మండలం ఖమ్మంపల్లి శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి లారీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలి

● తపాలశాఖ ఎస్పీ శ్రీహరి

దౌల్తాబాద్, సెప్టెంబరు 26: తపాలశాఖలో ప్రమాద బీమా చేయించుకుంటే కుటుంబాలకు అండగా ఉంటుందని ఎస్పీ శ్రీహరి సూచించారు. మండల పరిధిలోని దొమ్మాట తపాలశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రమాద బీమా లబ్ధిపై గురువారం అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టాఫీస్‌లో 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల ప్రజలకు అత్యవసర సమయంలో జరిగే ప్రమాదాలకు అనేక రకాల బీమా పథకాలు ఉన్నాయన్నారు. రూ.755తో బీమా చేసుకుంటే రూ.15 లక్షల ప్రమాద బీమా వర్తింస్తుందన్నారు. అనంతరం ఇటీవల అల్వాల గ్రామానికి చెందిన పుల్ల పరుశురాములు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా మృతుడికి పోస్టాఫీస్‌లో బీమా ఉండడంతో బాధిత కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజిత, వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

● మహాసభ రాష్ట్ర వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 26: ముదిరాజ్‌ల సంక్షేమాన్ని సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆరోపించారు. గజ్వేల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 26357 చిన్న నీటి వనరులు ఉండగా, గత ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించి సకాలంలో నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం టెండర్ల పేరిట నిర్లక్ష్యం చేయడంతో నేటికి చేప పిల్లల పంపిణీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు నర్సింహులు, భాస్కర్, మనోహర్, రమేష్, చంద్రం, సత్యానారాయణ, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దంపతులకు తలంబ్రాల అందజేత

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 26: భద్రాచల దేవస్థానం ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే వంటేరు యాదవరెడ్డి దంపతులకు గురువారం రామకోటి రామరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. భద్రాచల ముత్యాల తలంబ్రాలు అందుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలమో అన్నారు. మరోభక్త రామదాసుగా గుర్తించిన భద్రాచలం దేవస్థానం వారు 100 కిలోల ముత్యాల తలంబ్రాలు రామకోటి సంస్థకు అందజేయడం రామభక్తికి నిదర్శనం అన్నారు.


కుకునూరుపల్లి: విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


మద్దూరు: సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వీరవనిత చాకలి ఐలమ్మ

రజాకార్లను ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అధికారులు, నాయకులు కొనియాడారు. ఆమె జయంతి సందర్భంగా గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


దూళిమిట్ట: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


ములుగు: మామిడాలలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్

సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక


రైతులతో మాట్లాడుతున్న డీఏవో రాధిక

చిన్నకోడూరు, సెప్టెంబరు 26: సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. మండలంలోని అనంతసాగర్ రైతు వేదికలో గురువారం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి, పత్తి పంటల్లో నేల ఆధారిత ఎరువుల యాజమాన్యంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, పత్తి, కంది పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏడీఏ పద్మ, శాస్త్రవేత్త పల్లవి, ఏవో జయంత్‌కుమార్, ఏఈవోలు శిరీష, జమీల్, అశోక్, శివ, లక్ష్మి, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

● **రాయపోల్:** పత్తి పంటలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ సూచించారు. కొత్తపల్లిలో వరి, ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా వేసిన పత్తి పంటను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగులు, పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వాటి నివారణ కోసం తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో రజిత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇంటి నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

● కార్యదర్శిపై చర్యలకు డీపీవోకు సిఫార్సు

చేర్యాల, సెప్టెంబరు 26: అక్రమ ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడంలేదని, జవాబుదారీతనంతో పని చేయడంలేదంటూ చేర్యాల మండలం ఆకునూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పులి బాలయ్యపై వచ్చిన ఫిర్యాదులపై డీఎల్పీవో మల్లికార్జున్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన స్వర్గం యాదగిరి అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ ఇంటి నిర్మాణంతో తన ఇల్లు దెబ్బతిన్నదని, పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోలేదని కొద్దిరోజుల క్రితం శ్రీహరి అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ అక్రమ నిర్మాణంగా నిర్ధారించి మెమో జారీ చేయడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. అనంతరం డీఎల్పీవో ఇటీవల పంచాయతీ కార్యదర్శి బాలయ్యను సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేశారు. డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వర్గం యాదగిరి ఇంటినిర్మాణంతో పాటు భైరు శ్రీహరి ఇంటిని పరిశీలించారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనులు సరిగా లేవన్న విషయం మేరకు పలు వీధులను పరిశీలించారు. ఆయా అంశాల పరిశీలనతో పంచాయతీ కార్యదర్శి పులి బాలయ్య పని తీరుపై అసహనం వ్యక్తం చే శారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక తయారుచేసి కార్యదర్శి బాలయ్యపై చర్యల నిమిత్తం డీపీవోకు సిఫారసు చేయ నున్నట్లు డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి స్థానికులకు తెలిపారు. ఆయనవెంట ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ ఉన్నారు.


పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న డీఎల్పీవో

ఎంపీవో సేవలు చిరస్మరణీయం

అక్కన్నపేట, సెప్టెంబరు 26: అక్కన్నపేట ఎంపీవోగా కవికుమార్ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీడీవో బానోతు జయరాంనాయక్ అన్నారు. ఐదు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందిన కవికుమార్ చిత్రపటానికి మండల పరిషత్ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో తోడేటి ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

నంగునూరు మాజీ ఎంపీపీ మృతి

నంగునూరు, సెప్టెంబరు 26: నంగునూరు మండల మాజీ ఎంపీపీ లింగంపల్లి లచ్చవ్వ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. తెలంగాణ ఉద్యమంలో ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. లచవ్వ మృతి పట్ల సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

ట్రస్టు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేయడం అభినందనీయం

మర్కుక్, సెప్టెంబరు 26: స్పందన చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేతి రాత పుస్తకాలు అందించడం అభినందనీయమని మర్కుక్ మండల విద్యాధికారి వెంకట్‌రాములు అన్నారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో ఏర్పాటు చేసిన నోటు పుస్తకాల వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేశారు. మర్కుక్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రాములును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిషన్‌తో ఉపాధ్యాయులు సంతోషిమాత, హారిక, చిన్నికృష్ణ తదితరులు ఉన్నారు.

ఎంఈవోకు సన్మానం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 26: కుకునూరుపల్లి మండల ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన బచ్చలి సత్తయ్యని పోల్కంపల్లి నరేందర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మిట్టపల్లి రుషి, కనకయ్య, పలువురు నాయకులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 26: లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ పి.శ్రీనివాస్ తెలిపారు. చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్, అంకంపేట, నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహీంపూర్, కోదండరావుపల్లి, బంజేరుపల్లి గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

'సమసమాజ నిర్మాణంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుంది'


కవి సాయంత్రంలో కవులు, ప్రజా ప్రతినిధులు

హుస్నాబాద్, సెప్టెంబరు 26: సమసమాజ నిర్మాణంలో సాహిత్యం కీలకపాత్ర పోషిస్తున్నదని హుస్నాబాద్ మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో జనజాగృతి కళాసంస్థ ఆధ్వర్యంలో కవి సాయంత్రం పేరిట గురువారం కవి సమ్మేళనం నిర్వహించారు. సమాజాన్ని ప్రభావితం చేసే ఏకైక శక్తి కేవలం సాహిత్యానిదేనని వెల్లడించారు. కార్యక్రమంలో జనజాగృతి కళాసంస్థ అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న, కౌన్సిలర్ చిత్తారి పద్మ, సామాజిక విశ్లేషకులు వడ్డెపల్లి మల్లేశం, మాజీ ఏజీపీ చిత్తారి రవీందర్, కవులు దేవర కనుకయ్య, నీలం సంపత్, మెతుకు కొమురయ్య, కల్లెం లక్ష్మన్, లక్ష్మారెడ్డి, పెద్ది వెంకట్రాజం, చంద్రమౌళి తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మానవహారం

చేర్యాల, సెప్టెంబరు 26: స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం చేర్యాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి అంగడి బజారు చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి జనగామ-సిద్దిపేట ప్రధానరహదారిపై మానవహారం చేపట్టారు. భిక్షాటన చేసిన అనంతరం యూనియన్ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ మాట్లాడారు. గత ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాత్సారం చేస్తుండడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వెంటనే బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని, లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పురమ రాకేశ్, కిరణ్, మధు, విక్రమ్, సంజు, అఖిలేశ్, నరేశ్, రమ్య, సాహితీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు, సెప్టెంబరు 26: రాబోయే తరానికి పౌష్టికాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. మండలంలోని లద్నూరులో గురువారం ఏర్పాటు చేసిన పోషణమాసోత్సవాలలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిషోర బాలికలు చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ పుష్పలత, సెక్రటరీ శ్రీనివాస్, ఏఎన్ఎం యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఎలిజబెత్, విజయ, మంజుల, ఆశాలు పాల్గొన్నారు.

● **సిద్దిపేట అర్బన్:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని కేంద్రంలోనే తినాలని ఏసీడీపీవో ఛాయాదేవి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఇంద్రానగర్ ఐసీడీఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టిక మాసోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో ఛాయాదేవి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు తినడం వల్ల అవసరమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కవిత అంగన్‌వాడీ టీచర్లు వినోద, అహ్మదా ఏఎన్ఎం రేణుక స్వర్ణ ఆశావర్కర రాధ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్: మాట్లాడుతున్న ఛాయాదేవి

● **దూళిమిట్ట:** మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్నగుట్ట తండా అంగన్‌వాడీ పోషణ మాసం వేడుకలను స్థానిక రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీడీపీవో రమాదేవి, వైద్యాధికారి గౌతమి హాజరై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లందరికీ పోషణమాసం కార్యక్రమాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రేణుక, పుష్పలత, కో ఆర్డినేటర్ కనకరాజు, ఏఎన్ఎం జ్యోతిరాణి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలి

● డీఆర్డీవో జయదేవ్ ఆర్య


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో

బెజ్జంకి, సెప్టెంబరు 26: మహిళ సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృకి తోడ్పాటునందించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం డీఆర్డీవో జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈవో రమేష్ ఆయా గ్రామాల వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలను, శ్రీనిధి రుణాలను నెలవారి టార్గెట్‌గా ఇప్పించాలని సూచించారు. గ్రామాల్లో మహిళా సంఘాల్లో చేరని మహిళలను గుర్తించి, వారిని సంఘాల్లో చేర్పించేలా చొరవ చూపాలన్నారు. అక్టోబరు రెండో తేదీ వరకు కొనసాగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దాచారం గ్రామంలో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న గడ్డి, చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమేష్, అదనపు డీఆర్డీవో మధుసూదన్, ఎంపీడీవో ప్రవీణ్, ఐకేపీ ఏపీఎం నరసయ్య, సీసీలు సారయ్య, తిరుపతి, పద్మ, వీవోఏలు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో బోర్ వేయించిన మాజీ సర్పంచ్


బోర్ మోటార్‌ను ప్రారంభిస్తున్న చిక్కుడు చంద్రం, తదితరులు

తొగుట, సెప్టెంబరు 26: మండలంలోని తుక్కాపూర్ తుర్కకాశ గుడిసెల కాలనీలో నీటి ఎద్దడి నెలకొనడంతో గురువారం మాజీ సర్పంచ్ చిక్కుడు చంద్రం ముదిరాజ్ స్పందించారు. సొంత ఖర్చులతో సుమారు 1లక్ష 50 వేలు వెచ్చించి బోరు వేయించి మోటార్‌ను ఇప్పించారు. దీంతో గ్రామస్థులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు సభ్యులు జలీల్, నాయకులు మోహీన్, అమీర్, జహంగీర్, షేక్ అలీ, షేక్ నాగు, హైదర్, మదర్, లఖుం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ధర్నాకు తరలిన జేఏసీ నాయకులు

మర్కుక్, సెప్టెంబరు 26: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను క్రమవర్గీకరణ చేయాలని, విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద తలపెట్టిన ధర్నాకు మర్కుక్ నుంచి జేఏసీ జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మరాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరినీ వెంటనే విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో మర్కుక్ సెక్షన్ అధ్యక్షుడు కొంతం నరసింహులు, కార్యదర్శి పొట్బోళ్ల దాసు, బుచ్చిరెడ్డి ఉన్నారు.

ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన కిష్టయ్య

చేర్యాల, సెప్టెంబరు 26: చేర్యాల ఎంఈవోగా రచ్చ కిష్టయ్య బాధ్యతలు చేపట్టారు. పెద్దరాజుపేట-పోతిరెడ్డిపల్లి జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిష్టయ్యను ఎంఈవోగా నియమించిన క్రమంలో గురువారం కార్యాలయ రికార్డుల్లో సంతకాలు చేసి విధులలోకి చేరారు. ఈ మేరకు ఆయనను పీఆర్టీయూ అధ్యక్షుడు కేవీఎన్‌రెడ్డి, కార్యదర్శి పి.ధర్మారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన నాయకులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 26: సిద్దిపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ (నారయణరావుపేట) స్కూలును గురువారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు సందర్శించారు. రెసిడెన్షియల్ స్కూలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు యాదగిరి, బండి శ్రీకాంత్, గుజ్జరాజు పిట్ల రాకేష్, గొల్లపల్లి రాజశేఖర్, భానుచందర్, జానకి చందు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు

● మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 26: పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తిస్తారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను ఆరోగ్యంగా ఉంచడమే పాలకవర్గ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, కౌన్సిలర్స్ వంటేరు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య, బబ్బురి రజితాగౌడ్, తలకొక్కుల భాగ్యలక్ష్మీ దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** పంచాయతీ సెక్రటరీలు, కార్మికులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సెక్రటరీలు, కార్మికులకు వైద్యాధికారి రజిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మద్దూరు, నర్సాయపల్లి, గాగిళ్లాపూర్, ధర్మారం, గ్రామాల పంచాయతీ సెక్రటరీలు వెంకటేశ్వర్లు, భాస్కర్, అశోక్, రజియాతో పాటు కార్మికులు పాల్గొన్నారు. రేబర్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పంచాయతీ కార్యదర్శి ముగ్గుల పోటీలతో పాటు బతుకమ్మ ఆటపాటలు, కుర్చీలాట, లెమన్ స్పూన్ ఆటలు ఆడించారు.


తొగుట: పంచాయితీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

● **తొగుట:** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలో పని చేస్తున్న 75 మంది సఫాయి కార్మికులకు రక్త, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాధాకిషన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ అధికారి స్వరూప, ఆరోగ్య సిబ్బంది తార, హెల్త్ అసిస్టెంట్ నక్క రాములు, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్, వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్, పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు రమాదేవి తదితరులున్నారు.


హుస్నాబాద్ టౌన్: పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విరబూసిన బ్రహ్మకమలం



అరుదుగా పూసే బ్రహ్మకమలం సిద్దిపేటలో విరబూసింది. పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన దొంతుల నర్సింగం మధురిమ దంపతుల ఇంటి పైనా ఏర్పాటు చేసిన టెర్రస్ గార్డెన్‌లో ఈ బ్రహ్మ కమలం పూసింది. దీంతో కమలం పూసిన చోట పసుపు, కుంకుమ వేసి, దీపం వెలిగించి పూజలు చేశారు.

- సిద్దిపేట కల్చరల్